గంజాయి, గుట్కా విక్రేతలపై కఠిన చర్యలు

● ఎస్పీ రాహుల్ హెగ్డే

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మే 29 : గంజాయి, గుట్కాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సిబ్బందికి సూచించారు. అలాగే పెండింగ్ కేసులు వేగంగా దర్యాప్తు చేసి చార్జిషీట్ త్వరగా కోర్టులకు సమర్పించాలని తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పటిష్టంగా అమలు చేయాలని కేసు ఆధారాలుగా టెక్నికల్ ఆధారాలను రికార్డు చేసుకోవాలని, చోరీ కేసులను త్వరగా ఛేదించాలన్నారు. రోడ్డు భద్రతా విషయంలో నిత్యం తనిఖీలు చేస్తూ కఠినంగా వ్యవహరించాలని, రోడ్డు నియమాలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొవాలని పేర్కొన్నారు. సమావేశంలో కోదాడ సబ్ డివిజన్ డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, పాండరి, సీఐలు, ఐటీ కోర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చందుపట్ల పాఠశాలలో పనుల తీరుపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

పాఠశాలల పనులు వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ ప్రియాంక

చివ్వెంల, మే 29 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మంజూరైన పనులు వేగంగా పూర్తి చేయాలని, విద్యార్థినీ విద్యార్థులకు సౌకర్యవంతంగా, ఆదర్శంగా ఉండేలా సుందరీకరించాలని అదనపు కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని బండ మీదిచందుపట్ల జడ్పీహెచ్ఎస్, తుల్జారావు పేట ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులను ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ ఈఈ పనుల పర్యవేక్షణ చేసి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. విద్యుత్ పనులు మూడు రోజుల్లో పూర్తి కావాలని ఆదేశించారు. పనులపట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ, ఎంపీఓ గోపి, ఎంఈఓ గోపాల్‌రావు, ఆర్‌అండ్‌బీ ఏఈఈ యుగేంధర్, ఏపీఎం రాంబాబు, అశోక్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలల ప్రారంభం నాటికి యూనిఫామ్స్ అందించాలి

● డీఆర్‌డీఓ మధుసూదన్‌రావు



కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రావు

ఆత్మకూర్.ఎస్, మే 29 : పాఠశాలలు పున:ప్రారంభం నాటికి యూనిఫామ్స్ అందజేయాలని డీఆర్‌డీఓ పీడీ మధుసూదన్‌రావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అందించే ఏక రూప దుస్తులను మహిళా సంఘం ద్వారా మండల కేంద్రంలో కుట్టిస్తుండగా బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. దుస్తుల రికార్డులను పరిశీలించి ఏపీఎం మంజులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ డి.సురేశ్‌బాబు, ఎంపీడీఓ హసేం, ఎంపీఓ సంజీవ, డీపీఎం రత్తయ్య, ఆంజనేయులు, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంఘం నాయకులు

ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు చేపట్టాలి

● టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భిక్షం

కోదాడ రూరల్, మే 29 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ భిక్షం అన్నారు. బుధవారం జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన టీపీటీఎఫ్ సంఘం దశాబ్ది ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. తొలుత సీనియర్ నాయకురాలు సీహెచ్ పద్మావతి సంఘం జెండాను ఎగురవేశారు. డివిజన్ బాధ్యుడు బడుగుల సైదులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏ.హనుమంతరావు, పోటు నరసింహారావు, డీఎన్ స్వామి, జేఆర్‌కే మూర్తి, దుర్గాప్రసాద్, కొల్లు శ్రీనివాస్, నందిపాటి సుధాకర్, ఉమామహేశ్వర్‌రావు, పొదిల కృష్ణయ్య, రామినేని సతీశ్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

హుజూర్‌నగర్, మే 29 : హుజూర్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ యరగాని శ్రీనివాస్‌గౌడ్‌పై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం ప్రాథమిక సహకార సంఘ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సంఘ డైరెక్టర్లతో ఓటింగ్‌ను నిర్వహించినట్లు జిల్లా సహకార అధికారి పద్మ తెలిపారు. ఫలితాన్ని హైకోర్టు ఉత్తర్వులు వెలువడిన అనంతరం ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈఓ నరేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కోదండ రామాలయంలో మండల పూజా మహోత్సవం

నేరేడుచర్ల, మే 29 : నేరేడుచర్ల పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయం సమీపంలోని కోదండ రామాలయంలో గురువారం మండల పూజ మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 9:30 వరకు గోపూజ, గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, పుణ్యవాచనము, 11 గంటలకు సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం, 11:30కి సుదర్శన హోమం, మధ్యాహ్నం ఒంటి గంటకు నైవేద్యం, ప్రసాద వితరణ, సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. భక్తులందరూ స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

ధాన్యం అక్రమార్కులపై ఆర్ఆర్ యాక్ట్

● రూ.9 కోట్ల ధాన్యం మాయంతో యాజమాన్యాలపై చర్యలు
● ముందే హెచ్చరించిన నమస్తే తెలంగాణ

సూర్యాపేట, మే 29 (నమస్తే తెలంగాణ) : కస్టం మిల్లింగ్ కోసం ఇచ్చిన సుమారు రూ.200 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని అక్రమంగా విక్రయించుకుని సొమ్ము చేసుకోవడంతో కేసు నమోదైన నెల రోజులకు అక్రమార్కులపై మరో కేసు నమోదు చేసి అధికారులు జైలుకు పింపించారు. ఆరా తీయగా తొలుత కేసు నమోదైన తర్వాత ఎన్నికల బిజీలో అధికారులు ఉండి సదరు మిల్లులపై నజర్ వేయకపోవడంతో ఉన్న స్టాక్‌లో కూడా రూ.9 కోట్ల విలువైన ధాన్యాన్ని అమ్మేశారు. దాంతో నాలుగు రోజుల క్రితం రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి యజమానులను జైలుకు పంపించారు. తొలి కేసు నమోదైన తర్వాత ఆయా మిల్లుల్లో ధాన్యం మాయమవుతూ యాజమాన్యం పేరిట ఉన్న ఆస్తులు బినామీల పేరిట మారుతున్నాయని ఈ నెల 15న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'దో చినా దొరక్కుండా' శీర్షికతో వార్త ప్రచురితం కాగా అదే నిజం కావడం గమనార్హం. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం చేసే కేటాయింపుల్లో పలువురు మిల్లర్లు, అధికారులు కుమ్మక్కు అయ్యారు. రెవెన్యూ రికవరీ యాక్ట్‌లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకుని మోసాలు చేసి కోట్లాది రూపాయలు అక్రమార్జన చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే తెలంగాణ ఆవిర్భావానికి ముందు నుంచే వందల కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడిన పదిహేనుకు పైనే మిల్లులపై కేసులు నమోదయ్యాయి. బాకీపడ్డ కొన్ని మిల్లులు నేడు ఆన వాళ్లు కూడా లేవు. కొన్ని మిల్లులపై అధికారులు ఆర్ఆర్ యాక్ట్ కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. తదనంతరం సదరు మిల్లుల్లో వందలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. వారికి జీవనభృతి పోతుందనే కోణంలో స్టే తెచ్చి యథేచ్ఛగా మిల్లులను నడిపిస్తున్నారు. అయితే ఇలాంటి మిల్లులపై ఏండ్ల తరబడి ఉన్న స్టేను తొలగించేందుకు అధికారులు కనీస ప్రయత్నాలు కూడా చేయకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా రెండు మిల్లుల్లోనే సుమారు రూ.200 కోట్ల ధాన్యం కుంభకోణం వెలుగులోకి రాగా స్టాక్ లెక్కేసి కేసు నమోదు చేయగా మళ్లీ నెల రోజులు తిరుగకముందే మరో రూ.9 కోట్ల ధాన్యం మాయం కావడం పట్ల అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యం కనిపిస్తున్నది. జిల్లాలోని మిల్లర్లందరికీ ఆదర్శంగా నిలవాల్సిన అధ్యక్షుడే అవినీతికి పాల్పడడం గమనార్హం. తిరుమలగిరిలోని రఘురామ, సంతోషి ఫారాబాయిల్డ్ మిల్లుల్లో ఏప్రిల్ 15న అధికారులు, సిబ్బంది తనిఖీలు చేశారు. రఘురామ మిల్లులో వాస్తవానికి 46 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండాల్సి ఉండగా కేవలం 8 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నది. అలాగే సంతోషి మిల్లులో 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉండాల్సి ఉండగా కేవలం 7,500 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నది.

దాంతో ఈ రెండు మిల్లులపై కేసులు నమోదు చేసి రికవరీ కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులంతా ఎన్నికల బిజీలో ఉండగా రఘురామలో ఉన్న 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యంలో సుమారు రూ.6 కోట్ల విలువ చేసే 3,500 మెట్రిక్ టన్నులు, సంతోషిలో 7,500 మెట్రిక్ టన్నులు ఉండగా వాటిలో కూడా రూ.6.5 కోట్ల విలువ చేసే ధాన్యం మాయమైంది. దాంతో ఈ రెండు మిల్లులపై రెవెన్యూ రీకవరీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి యాజమానులను జైలుకు పంపించారు. రెండు మిల్లుల నుంచి దాదాపు రూ.200 కోట్లకు పైనే ధాన్యం మాయంకావడం, గత నెల రోజులుగా యాజమాన్యం పేరిట ఉన్న ఆస్తులను ఇతరుల పేరిట మార్పిడి చేయడంతో కేసులు కొలిక్కి వచ్చేదెన్నడు..రికవరీ ఎలా సాధ్యం అనే దానికి సివిల్ సప్లై అధికారుల వద్ద సమాధానం లేదు.

వర్ధమానుకోటలో పెద్ద మైసమ్మ వద్ద పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

నాగారం, మే 29 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను, దైవ చింతనను పెంపొందించుకోవాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో పెద్ద మైసమ్మ తల్లి పండుగ మహోత్సవానికి బుధవారం హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, ఎంపీటీసీ వడ్డె పరశురాములు, మండల యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్‌కుమార్, గుండగాని అంబయ్య, ఈదుల అరుణ్‌కుమార్, రాంరెడ్డి, యాదగిరి, మల్లేశ్, మహేందర్, రమేశ్, వినయ్, కిరణ్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

అర్వపల్లి, మే 29 : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన అల్లి భారతమ్మ ఇటీవల మృతి చెందింది. బుధవారం బీఆర్ఎస్వీ నాయకులు 50 కిలోల బియ్యంను అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గంగాదేరి వెంకట్, పాలబిందెల బాబు, శీలం బాబు, ఎల్లయ్య, సతీశ్, మహేశ్, యుగేంధర్, వంశీ పాల్గొన్నారు.

చెరువుకు పోయే వరద కాల్వ పూడ్చివేత

మార్కమ్మ చెరువుకు పోయే కాల్వలో ట్రాక్టర్లతో పోస్తున్న మట్టి

మద్దిరాల, మే 29 : మండల కేంద్రంలో గల మార్కమ్మ చెరువుకు పోయే కాల్వను మట్టితో పూడ్చివేస్తున్నాడు. చెరువులోకి వరద నీరు చేరడానికి ఎస్సీ కాలనీకి సమీపంగా వరద కాల్వను తీశారు. ఇప్పుడా వరద కాల్వలో కొందరు రైతులు మట్టిపోసి చెరువుకు నీళ్లు రాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. వర్షాలు వచ్చి కాల్వలు పాగినప్పుడు అడ్డం పోసిన మట్టి వల్ల చెరువులోకి నీరు చేరకపోగా కాల్వ పొంగి ఎస్సీ కాలనీలోని ఇండ్లలోకి చేరి కాలనీ మొత్తం ముంపునకు గురయ్యే పరిస్థితి నెలకొన్నది. అధికారులు స్పందించి కాల్వలో మట్టి పోసిన రైతులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ కాలనీ వాసులు కోరారు.

హైవే పైకి మూగ జీవాలు

● గడ్డి మేసేందుకు రోడ్ల మధ్యలోకి
● ప్రమాదాల భారిన వాహనదారులు

పట్టణ సమీపంలోని అంజనాపురి కాలనీ వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి మధ్యలో గడ్డి మేస్తున్న బర్రెలు

సూర్యాపేట రూరల్, మే 29 : మూగ జీవాల పెంపకందారుల నిర్లక్ష్యం, హైవే అధికారుల పట్టింపులేనితనంతో వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. వాహనాలు డ్యామేజీ కావడంతో పాటు పలు సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. మండల పరిధిలోని టేకుమట్ల నుంచి దురాజ్‌పల్లి వరకు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి, ఇటు సూర్యాపేట-జనగామ రహదారిపై వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటాయి. కాగా టేకుమట్ల నుంచి సుమారు 15 కిలోమీటర్లు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి డివైడర్‌లో పచ్చని గడ్డి పెరుగడంతో రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు తమ బర్రెలు, ఆవులు, గొర్రెలు, మేకలను డివైడర్‌లో గడ్డి కోసం వదిలి వెళ్తున్నారు. అవి గడ్డి మేస్తు మేస్తూ డివైడర్ నుంచి ఒక్కసారిగా రహదారి పైకి వస్తున్నాయి. దాంతో రహదారిపై వేగంగా వెళ్లున్న వాహనాలు వాటిని ఢీకొనడంతో ప్రమాదాల భారిన పడుతున్నారు. కొన్నిసార్లు మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు ఉంటున్నాయి. హైదాబాదు-విజయవాడ జాతీయ రహదారి వెంట ఉన్న టేకుమట్ల, రాయిన్‌గూడెం, పిల్లలమర్రి, జనగామ క్రాస్‌రోడ్డు, దురాజ్‌పల్లి, సూర్యాపేట-జనగామ రహదారి వెంట గాంధీనగర్, బాలెంల, ఎర్కారం, రాజానాయక్‌తండా, రామన్నగూడెం గ్రామాల వెంట ఈ పరిస్థితి తలెత్తుతున్నది. పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూమి అక్రమ పట్టా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

● నూతనకల్ తాసీల్దార్ కార్యాలయంలో కుటుంబం ధర్నా

తాసీల్దార్ కార్యాలయంలో ధర్నా చేస్తున్న రమేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులు

నూతనకల్, మే 29 : జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఆదేశాలను ధిక్కరించి తాసీల్దార్, డిప్యూటీ తాసీల్దార్ తమ భూమిని ఇతరులకు పట్టా చేశారని ఆరోపిస్తూ మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన మొరిగాల రమేశ్‌గౌడ్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి తాసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగాడు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. 2013లో తనతో పాటు మరో నలుగురు రేసు రాములు, రాచకొండ అయోధ్య, లింగాల ఏకస్వామి దిర్శనపల్లి గ్రామ శివారులోని 79అ సర్వే నంబర్‌లో 3 ఏకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపాడు. నలుగురం కలిసి అయోధ్య పేరిట సాదా బైనామాలో పట్టా చేయించినట్లు చెప్పాడు. అనంతరం అయోధ్య, రాములు తమ వాటాలను విక్రయించగా తాను ఏక స్వామి కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. తమకు పట్టా చేయకుండా అయోధ్య ఆ భూమి తనదేనని పేర్కొంటూ కోర్టులో కేసు వేయగా తానూ జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు వేసినట్లు వివరించాడు. తాసీల్దార్, ఆర్ఐ, ఆర్డీఓ రిపోర్టు ప్రకారం తనకు సాదా బైనామాలో పట్టా చేయాలని జేసీ కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్లు వెల్లడించాడు. అయితే అప్పటి తాసీల్దార్ జమీరుద్దీన్, డీటీ శ్రీధర్‌నాయక్ తనకు పట్టా చేయకుండా కాలయాపన చేసినట్లు తెలిపాడు. అనంతరం తమకు తెలియకుండానే తాసీల్దార్ 5 కుంటల భూమిని కనకటి శ్రావణ్ పేర, డీటీ శ్రీధర్‌నాయక్ సిక్కుల శంకరయ్య పేర 30 కుంటల భూమిని అక్రమంగా పట్టా చేశారన్నారు. జేసీ తీర్పును అమలు చేయకుండా తమ భూమిని మరొకరికి అక్రమంగా పట్టా చేసిన అధికారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

● ఇద్దరు మృతి
● మరొకరి పరిస్థితి విషమం

హుజూర్‌నగర్/ హుజూర్‌నగర్ రూరల్, మే 29 : బైక్ ఆదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న దుర్ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. గరిడేపల్లి మండలం వెంకట్రాపురం గ్రామానికి చెందిన కుర్ర సైదులు (40) బతుకుదెరువు కోసం చౌటపల్లిలో ఉంటూ మఠంపల్లి ఫ్యాక్టరీలో ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తన సొంతూరులో గంగమ్మ పండుగ ఉండడంతో సోమవారం కుటుంబంతో వెళ్లాడు. ఆయన అన్న వీర వెంకన్న హుజూర్‌నగర్‌లో ఉంటున్నాడు. పండుగ అనంతరం బుధవారం తిరిగి తను ఉంటున్న చౌటపల్లికి హుజూర్‌నగర్ మీదుగా బయల్దేరాడు. భార్య రమాదేవి, కుమార్తెలు సౌమిక, జస్మిక, సోదరుడి కూతురు స్వాతి ఉండటంతో భార్య రమాదేవి, చిన్న కూతురు జస్మికను బస్సు ఎక్కించి సోదరుడి కూతురు శ్రీనిధి (10), తన కూతురు సౌమికను సైదులు బైక్‌పై ఎక్కించుకుని హుజూర్‌నగర్‌కు బయల్దేరాడు. గోపాలపురం సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో సైదులు, అతడి సోదరుడి కూతురు శ్రీనిధి అక్కడికక్కడే మృతి చెందారు. సౌమికకు తీవ్ర గాయాలు కావడంతో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

తాటిచెట్టు పైనుంచి పడ్డ గీత కార్మికుడు మృతి

తుంగతుర్తి, మే 29 : మండలంలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బాలగాని మల్లయ్య (45) ఈ నెల 25న ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

● ఇద్దరు వ్యక్తులు రిమాండ్, వాహనం సీజ్

నేరేడుచర్ల, మే 29 : ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పీడీఎస్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పట్టుకుని వారి వద్ద నుంచి రెండు క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు బుధవారం ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు. మండలంలోని చిల్లేపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడకు చెందిన పిండిప్రోలు పర్వతాలు, ఆయన అనుచరుడు దేవరమల్ల మల్లయ్య బొలోరో వాహనంలో 2 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి గుండ్లపహాడ్ దర్గా ఉర్సు

పాలకవీడు, మే 29 : మండలంలోని గుండ్లపహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు దర్గా కమిటీ సభ్యులు సయ్యద్ ఉస్మాన్ బాషా బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం గుసూల్, శుక్రవారం గంధం మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. దర్గా ముజావర్ సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు. .

అమీనాబాద్‌లో క్షుద్ర పూజల కలకలం

అనంతగిరి, మే 29 : మండలంలోని అమీనాబాద్‌లో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో బాధపడుతున్నది. కోదాడ మండలంలోని ఓ దేవాలయంలో నిత్యం పూజలకు వెళ్తుంటుంది. దేవాలయ పరిసరాలలో ఆమెను గమనించిన ఓ వ్యక్తి తన ఆరోగ్యం బాగు చేస్తానని, ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని, పూజలు చేసి వెలికి తీయాలని నమ్మించాడు. మరో ఐదుగురితో కలిసి అమీనాబాద్ చేరుకుని మంగళవారం రాత్రి ఓ పాత గదిలో పూజలు చేస్తుండగా అక్కడ వస్తున్న శబ్దాలను విన్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పూజలో పాల్గొన్న ఆరుగురిని ఆదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

'విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలి'

గరిడేపల్లి, మే 29 : ప్రభుత్వం రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులను అందించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది సాగర్ రిజర్వాయర్‌లోకి నీరు రాకపోవడంతో వానకాలం, యాసంగి సీజన్లలో సక్రమంగా పంటలు పండక రైతులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడ్డట్లు తెలిపారు. కావున ప్రభుత్వం వారి బాధలను అర్థం చేసుకుని ఈసారి పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఉచితంగా అందించి ఆదుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు

సైబర్ నేరాలపై అవగాహన

కోదాడ రూరల్, మే 29 : పట్టణ సర్వీస్ ఆటో డ్రైవర్లకు సైబర్ నేరాలపై ఏఎస్ఐ చారి బుధవారం అవగాహన కల్పించారు. పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హుసేన్‌గౌడ్, సుధాకర్, బాబు, సోమాని పాల్గొన్నారు..

పలుచోట్ల గుట్కా ప్యాకెట్ల పట్టివేత

మేళ్లచెర్వు : మండల కేంద్రంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా బస్తాలు

మేళ్లచెర్వు, మే 29 : గుట్కా అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో బుధవారం పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రూ.8 వేల విలువైన 1,264 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేశ్ తెలిపారు. ప్రభుత్వ నిషేధిత గుట్కాను అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మహిళపై కేసు నమోదు

నేరేడుచర్ల : గుట్కాలను విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు. పట్టణంలోని రామాలయం ముందు పాన్ దుకాణంలో గుట్కాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేయగా రూ.1,500 విలువ గల గుట్కాలు పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

హుజూర్‌నగర్ : గుట్కాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుజూర్‌నగర్ ఎస్ఐ జి.ముత్తయ్య అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని పలు షాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బలరాంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ 10న జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

● తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

బొడ్రాయిబజార్, మే 29 : గ్రామీణ ఉపాధి హామీ చట్ట రక్షణకై జూన్ 10న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టం-అమలు-సవాళ్లు అనే అంశంపై హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సుకు ఉపాధి హామీ కార్మికులు, సిబ్బంది అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పదేండ్లలో కూలీల హక్కులను హరించి చట్టాన్ని ఎత్తివేయాలనే కుట్ర చేస్తుందన్నారు. కొలతలను రద్దు చేసి ఆరు గంటల పనికి రూ.600 వేతనం ఇవ్వాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని, వారం వారం వేతనాలు చెల్లించాలని, పని కల్పించకుంటే నిరుద్యోగ భృతి చెల్లించాలని, పని ప్రదేశంలో నీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్టు, పిల్లల సంరక్షణకు ఆయాను నియమించాలని, పనిముట్లు అందజేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు పులుసు సత్యం, జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసాని వెంకటేశ్వర్లు, బెల్లంకొండ వెంకటేశ్